

అడవి బిడ్డల పండుగ సీత్లా

బంజారాలు పవిత్రంగా నిర్వహించే మొదటి పండుగ సీత్లా పండుగ. ఆషాడంలో ఒక మంగళవారం ఎంచుకుని పండుగను నిర్వహిస్తారు. - 8లో▸



సహకార సంఘాలు బలోపేతం

- 8లో▸

కామన్ సర్వీస్ సెంటర్‌ల నిర్వహణతో పీఏసీఎస్‌లు మరింత బలోపేతం అవుతాయని మార్నేని రవీందర్‌రావు అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/24^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్షీరాభిషేకం



ములుగు: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు, జీవంతరావుపల్లి, బండారుపల్లిని కలిపి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క మున్సిపాలిటీగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ములుగు ప్రజల మున్సిపాలిటీ కలను మంత్రి సీతక్క నిజం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీతక్క జన్మదినం సందర్భంగా శుభ వార్త రావడం మరింత ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



వాజేడు: బొగత జలపాతం వద్ద సోమవారం చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రేంజర్ చంద్రమౌళి సహకారంతో యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, చీకుపల్లి, గుమ్మడి దొడ్డి యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 20యూనిట్ల రక్తాన్ని సేకరించి ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్య క్రమంలో మురళి, మల్లిక, వికాస్, భరత్, నారాయణ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు గోల్డ్ మెడల్స్



ఏటూరునాగారం: మండలంలోని ఏటూరు నాగారం స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన క్రీడాకారులు గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో హైదరాబాద్‌లోని పుల్లల గోపిచంద్ అకాడమిలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఏటూరునాగారానికి చెందిన క్రీడాకారులు మెడల్స్ సాధించారు. పి. సంజన, దేవయ్య స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించారు. అలాగే వైష్ణవి దేవి 50 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కుమార్ తెలిపారు. వీరిని అథ్లెటిక్స్ ఇండియా కోచ్ నాగపురి రమేష్, విత్ ఐటీ కంపెనీ సతీష్ కుమార్, జిల్లా సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం పస్రా నాగారం రెవెన్యూ శివారులో గుడిసెలు వేసుకున్న నిరుపేద కుటుంబాలను ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు బాధితులతో కలిసి ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పస్రా శివారులోని 109/ఈ సర్వే నంబర్‌లో నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ప్రభుత్వం పట్టాలు జారీ చేయాలన్నారు. అదే గ్రామానికి చెందిన భూస్వాములు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునే ఆలోచనతో కోర్టుల చుట్టు తిరుగుతున్నారని వివరించారు. గతంలో కలెక్టర్, ఐటీడీఏ పీఓలు భూమి వివరాలను సేకరించి ప్రభుత్వ భూమిగా గుర్తించారని తెలిపారు. మంత్రి సీతక్క పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, ఆదిరెడ్డి, గఫూర్, రాజేందర్, రాజేష్, మల్లారెడ్డి, మురళి, రమేష్, ప్రవీణ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

సమావేశం జరిగేనా?

- ఐటీడీఏలో ఐదేళ్లుగా నిర్వహించని పాలకమండలి సమావేశం
- అమలుకాని ప్రభుత్వ పథకాలు
- పాలకులు, అధికారులు మారినా గిరిజనులకు అందని ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



ఐటీడీఏ కార్యాలయం

ఏటూరునాగారం: గిరిజనుల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన ఐటీడీఏ ద్వారా వారి జీవితాల్లో వెలుగులు రావడం లేదు. దీర్ఘకాలిక ఉద్యోగులున్నప్పటికీ ప్రభుత్వ పథకాలు పేదలకు అందడం లేదు. ప్రతీ మూడు నెలలకోమారు ఐటీడీఏ ద్వారా పాలక మండలి సమావేశం(గవర్నింగ్ బాడీ) నిర్వహించి ఐటీడీఏ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పథకాలు, నిధులు, ఖర్చు, వ్యయం ఉద్యోగుల క్రమబద్ధీకరణ అనేక విషయాలను చర్చించాల్సి ఉంటుంది. ఈ సమావేశం 2019 డిసెంబర్ 20వ తేదీన నిర్వహించి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు మళ్లీ ఐటీడీఏ పాలకమండలి సమావేశం నిర్వహించలేదు. దీంతో ఐదేళ్లుగా ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాల అమలు అంశాలు బయటకు తెలిసే పరిస్థితి లేకుండా పోయింది. అసలు పాలక మండలి సమావేశం మళ్లీ జరిగేనా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంత్రి సీతక్క సమావేశం నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు.

మూలకుపడిన పథకాలు

ఐటీడీఏ ద్వారా ట్రైకార్ నిధులతో ఎకనామికల్ సపోర్ట్ స్కీంను గిరిజనులకు అందజేసి వారికి రుణాలిచ్చి స్వయం ఉపాధి కింద కుటీర పరిశ్రమలు, షాపులు సుమారుగా 175 రకాల యూనిట్లను ఇవ్వాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 2020–21, 2021–22 సంవత్సరానికి 6,761యూనిట్లకు సబ్సిడీ నిధులు రూ.55.64కోట్లు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం మంజూరు ఇచ్చింది. వాటిని మండలాల వారీగా విభజించి మండల అభివృద్ధి అధికారుల(ఎంపీడీఓలు) ద్వారా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే 3,318 మందికి యూనిట్ల మంజూరుకు రూ.28.79 కోట్లను కేటాయించగా వాటిని యూనిట్లు పొందిన లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేయలేదు. ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో లబ్ధిదారులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సన్నగిల్లుతున్న గిరివికాసం

ఐటీడీఏ నిధులతో గిరివికాసం కింద ఐదు ఎకరాలు ఉన్న రైతుకు ఉచితంగా బోరు, మోటారు కరెంటును మంజూరు ఇవ్వాల్సి ఉంది. 3,018 మంది గిరిజనులను ఇప్పటి వరకు గుర్తించారు. ఇందులో రూ.8.54 కోట్లు బోర్‌వెల్‌కు, రూ.4.77 కోట్ల విద్యుత్, రూ.4.57 కోట్లు మోటారు, పంపుసెట్ల కొనుగోలు ఇతర వాటికి ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారే తప్పా అవి ఉపయోగంలోకి వచ్చినట్లు మాత్రం రికార్డులు లేకపోవడం బాధాకరం.



సర్వాయిలో గతేడాది వేసిన బోరు పాయింట్

అటకెక్కిన అటవీహక్కుల చట్టం

2009లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఐటీడీఏ పరిధిలో 14,016 మందికి అటవీహక్కు పత్రాలను అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 12వేల మందికి పట్టాలిచ్చింది. ఐటీడీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైతం లేకపోవడంతో ఎల్‌టీఆర్ కేసులు, ఆర్ఓఎఫ్ఆర్ కేసులు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. జీసీసీ నిర్లక్ష్యంతో అటవీ ఉత్పత్తుల సేకరణ సైతం మందకొడిగా సాగుతోంది. అలాగే ఐటీడీఏ పరిధిలో యూత్ ట్రైనింగ్ సెంటర్లలో గిరిజన నిరుద్యోగులకు వివిధ రకాలుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఆ సెంటర్లలో ఎలాంటి శిక్షణలు లేక ట్రైనింగ్ సెంటర్లు కళావిహీనంగా కనిపిస్తున్నాయి.

కనుమరుగవుతున్న శాఖలు

ఐటీడీఏలో పశుసంవర్ధకశాఖ, సెరికల్చర్, హార్టికల్చర్, ఇరిగేషన్ గతంలో పనిచేసేవి. గతంలో పశుసంవర్ధకశాఖ ద్వారా గొర్రెలు, పాడిగేదెలు ఇతర యూనిట్లు ఇచ్చేది. ఇప్పుడు ఆ శాఖకు ఎవరూ బాధ్యులు లేని పరిస్థితి ఉంది. అలాగే సెరికల్చర్ ద్వారా మల్బర్ తోటలు, దసలి పట్టు పురుగుల పెంపకం, దారం తయారీ వంటికి చేసేవారు. ఇప్పుడు అది కూడా మూసివేశారు. హార్టికల్చర్ ద్వారా మామిడి మొక్కలు, ఇతర పండ్ల మొక్కలను రైతులకు పంపిణీ చేసి వాటిని సాగు చేయించేవారు. అలాగే అరికలు, సామెలు ఇతర పంటలను కూడా సాగుచేయించేవారు. ఇప్పుడు ఆయా శాఖలకు అధికారులు లేరు. నీటిపారుదల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజన రైతులకు చెక్‌డ్యామ్‌లు, కాలువలు, చెరువుల నిర్మాణాలు చేపట్టేవారు. ఇప్పుడు ఆ శాఖను 2019లో జనగామకు తరలించిన నాటి నుంచి దాని ఊసేలేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాలకమండలి సమావేశం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ కనెక్షన్, మోటారు ఇవ్వాలి



బోరు నిర్మించారు కానీ విద్యుత్ కనెక్షన్, మోటారు ఇవ్వలేదు. ఏడాది దాటింది. కొత్తూరు సర్వాయిలో ఐదు ఎకరాల భూమి ఉంది. నాతోపాటు మరో ఆరుగురికి కూడా రాలేదు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం.

- పొడెం శోభన్, గిరిజన రైతు, సర్వాయి

పథకాలు గ్రౌండింగ్ చేయాలి



ఐటీడీఏ పరిధిలోని ఈఎస్ఎస్ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేయాలి. యూనిట్ల ఏర్పాటు చేసుకొని వారు ఆర్థికంగా ఎదిగే అవకాశాన్ని అధికారులు కల్పించాలి. యూనిట్లు మంజూరైనా గ్రౌండింగ్ కాక గిరిజనులు నష్టపోతున్నారు.

- కొర్నిబెల్లి విష్ణు, ఏటూరునాగారం

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి



ఆపరేషన్ ముస్కాన్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ శబరీశ్ తదితరులు

ములుగు రూరల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ వాల్ పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారు శిక్షార్హులని తెలిపారు. చిన్న పిల్లలతో బలవంతంగా భిక్షాటన చేయించినా, వెట్టి చాకిరి చేయించినా కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. బాల కార్మికులు కనిపిస్తే 1098లేదా 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ పోలీస్ నోడల్ ఆఫీసర్ డీఎస్పీ రాములు, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లెనినా, సీడబ్ల్యూసీ చైర్మన్ వసుద, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఓంకార్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలను రద్దు చేయాలి

- బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్



జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మద్రగాని వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజానికానికి, కక్షిదారులకు అనధికారికంగా న్యాయవాదులకు జుడిషియల్‌కు సంబంధించిన వర్గాలకు నూతన చట్టాలు క్లిష్టంగా మారాయని తెలిపారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ న్యాయ సంహిత తదితర చట్టాలపై మెజారిటీ ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సునిల్‌కుమార్, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, స్వామిదాస్, రాంసింగ్, ప్రతాప్, రాజేందర్, విజయ్, అశోక్, అలీ, నవత, అర్చన, రజిత తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రవాణాకు అంతరాయం



చెట్టును జేసీబీతో తొలగిస్తున్న పోలీసులు



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి మొదలుకుని సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లడంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని నార్లాపూర్, చింతల్‌క్రాస్ నుంచి పడిగాపురం వచ్చే దారిలోని జంపన్నవాగు లోలెవల్ కాజ్‌వేపై వరద ప్రవహించడంతో ఎలుబాక, పడిగాపూర్ గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో వెళ్లి ఎలుబాక లోలెవల్ బ్రిడ్జి వద్ద ముందస్తు జాగ్రత్తగా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. జంపన్నవాగులోకి భారీగా వరద చేరడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. అంతే కాకుండా తాడ్వాయి నుంచి కాటాపురం వెళ్లే దారిలో నాంపెల్లి బంజర వద్ద రోడ్డుపై భారీ వృక్షం పడిపోవడంతో రాక పోకలు స్తంభించాయి. సంఘటనా స్థలానికి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చేరకుని రోడ్డుపై అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని జేసీబీ సాయంతో తొలిగించి రాక పోకలను పునరుద్ధరించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి


- ఐటీడీఏ ఏపీఓ వసంతరావు



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ వసంతరావు

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి 36 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. వినతులు అందజేసిన వారిలో పలువురి సమస్యలు ఇలా ఉన్నాయి. ఏటూరునాగారం మండల బూటారానికి చెందిన యాలం నీలమ్మ సీఆర్‌టీపీ పోస్టు ఇప్పించాలని వేడుకున్నారు. మంగపేట మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన మేడ పుష్పమ్మ, ఏటూరునాగారం మండలం చెల్పాకకు చెందిన యనక సమ్మక్క, తాటి హనుమయ్య అటవీహక్కుల పత్రాన్ని ఇప్పించాలని కోరారు. రొయ్యూర్‌కు చెందిన అవున కృష్ణవేణి తనకు మీసేవ కేంద్రాన్ని ఇప్పించాలని విన్నవించారు. మంగపేట మండలం కమలాపురానికి చెందిన పల్తియా దామోదర్ గిరివికాసం కింద బోరు ఇప్పించాలని, రామన్నగూడేనికి చెందిన ఇస్లావంత్ శివలింగప్రసాద్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. వెంకటాపురం(కె) మండలం పాలెం గ్రామానికి చెందిన పొడెం ఆదిలక్ష్మి తనకు ఆలుబాక పాఠశాలలో ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నారు. కేసముద్రానికి చెందిన శారద సీఆర్‌టీ ఉద్యోగం ఇప్పించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన పీర్ల రవి బోర్, విద్యుత్ లైన్ ఇప్పించాలని కోరారు. మేడారంలో జాతర సమయంలో కళా ప్రదర్శన చేసిన డబ్బులు ఇప్పించాలని వరంగల్‌కు చెందిన నోమోజు వెంకటాద్రి కోరారు. వినతి పత్రాలను పరిశీలించి పీఓ ద్వారా పరిష్కారం చూపుతామని ఏపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపాధ్యాయుల డుమ్మా..



ఖాళీగా ఉన్న స్టాఫ్ రూం



ఉపాధ్యాయులు లేని తరగతి గదిలో విద్యార్థులు

- గతంలోనూ పలుమార్లు ఇదే తంతు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని లక్ష్మీపురం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సోమవారం విధులకు డుమ్మాకొట్టారు. స్థానికుల సమాచారం మేరకు ‘సాక్షి’ వెళ్లి పరిశీలించగా పాఠశాలలో 50మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు మాత్రం విధుల్లో లేరు. మండలంలో సీఆర్టీగా విధులు నిర్వర్తిస్తున్న ఒకరితో పాఠశాలను కొనసాగించారు. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా అందులో ఒకరు పాఠశాల పునః ప్రారంభం నుంచి రావడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మరో ఇద్దరు మాత్రం విడతల వారీగా పాఠశాలకు వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడిని వివరణ కోరగా ఒకరు స్కూల్ ప్రారంభం నుంచి విధులకు రావడం లేదని తెలిపారు. మరొకరు సెలవులో ఉన్నారని తాను కూడా ఎంఈఓను ఫోన్‌లో సెలవు కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని దాటవేసే సమాధానం ఇచ్చారు. ఇదే విషయంపై ఎంఈఓను వివరణ కోరగా తాను ఎవరికి సెలవులు ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై డీఈఓకు సమాచారం ఇచ్చి వారికి మెమోలు జారీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. గతంలోనూ ఈ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రమంగా వచ్చేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ టీఎస్.దివాకర



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర



మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్ జీలతో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రజావాణికి వస్తుంటారని తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖకు చెందిన 35, ఉద్యోగాలకు సంబంధించి 2, పింఛన్ కోసం 1, ఇతర శాఖలకు చెందినవి 8 ఇలా మొత్తంగా 46 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతీ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్య క్రమంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర, సివిల్ సప్లయీస్ మేనేజర్ రాంపతి, మైనారిటీ అధికారి ప్రేమలత, వివిధ శాఖల సంబంధిత అధికారులు, 9 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై కలెక్టర్ దివాకర అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యాశాఖాధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలు, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణుల, విద్యార్థుల, వ్యవసాయ రంగ, సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు మొదలైన ఆవిష్కరణలు ప్రదర్శించబడుతాయని తెలిపారు. ఆసక్తి గలవారు వాటికి సంబంధించిన ప్రదర్శన రెండు నిమిషాల వీడియో, నాలుగు ఫొటోలు, 100 పదాలతో వివరాలు రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543కి పంపాలని తెలిపారు. వృత్తి, ఊరుపేరు, జిల్లా పేరుతో వివరాలను ఆగస్టు 15లోగా పంపించాలని సూచించారు.

మహిళాశక్తి క్యాంటీన్ పరిశీలన

కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ టీఎస్.దివాకర పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కచే మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్యాంటీన్‌లో కావాల్సిన వంట సామగ్రి, ఫర్నీచర్, రిఫ్రిజిరేటర్‌తో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

వెంకటాపురం(కె): ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వాసు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి పని చేసిన కూలీలకు డబ్బులు చెల్లించలేదన్నారు. కూలీల సొమ్ము చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. కూలీల సొమ్ము చెల్లించే వరకు ఉద్యమం చేస్తామని తెలిపారు. రెండు వారాల్లో కూలీల సొమ్ము చెల్లించేలా చర్యలు చేపడుతామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శ్రీను, ఆదినారాయణ, హర్షవర్ధన్, సావిత్రి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

చిట్టీలతో మోసం.. నలుగురి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ మల్లయ్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్టీలు, మహాలక్ష్మీ పరపతి సంఘం పేరుతో 275 మంది నుంచి నెలవారీగా సుమారు రూ.5కోట్లు సేకరించి పరారైన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్ రైల్వేగేట్ పెరకవాడకు చెందిన పుప్పాల రాజేందర్, అతడి కుమారుడు అనురాగ్, భార్య శ్రీలత, కుమార్తె ప్రణవీ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాట చిట్టీలు, మహాలక్ష్మీ పరపతి సంఘం పెట్టి 275 మంది సభ్యుల నుంచి సుమారు రూ.5కోట్లు పైగా సేకరించి కుటుంబ సమేతంగా రాత్రికి రాత్రే పరారయ్యారు. దీనిపై వరంగల్ గిర్మాజీ పేటకు చెందిన పెంచాల రంజిత్ కుమార్.. రాజేందర్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులపై మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పెరకవాడలోని ఇంట్లోనే నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై యువకుడి దాడి

రఘునాథపల్లిలో ఘటన

రఘునాథపల్లి: హారన్ కొడుతూ ఓవర్ టేక్ చేసే క్రమంలో బస్సు డ్రైవర్‌ను చూస్తూ కారు నడుపుతున్న యువకుడు ఎగతాళి చేసిన వివాదం పరస్పర దాడుల వరకు వెళ్లిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టీజీఎస్ ఆర్టీసీకి చెందిన వరంగల్-1 డిపోకు చెందిన గరుడ బస్సు హనుమకొండ నుంచి ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తోంది. రఘునాథపల్లి దాటాక ముందు వెళ్తున్న కారు కొద్ది దూరం వరకు బస్సుకు సైడ్ ఇవ్వలేదు. హారన్ కొడుతూ ఓవర్ టేక్ చేసే క్రమంలో కారు నడుపుతున్న యువకుడు బస్సు డ్రైవర్‌ను చూస్తూ ఎగతాళి చేశాడు. దీంతో బస్సును డ్రైవర్ పక్కన ఆపాడు. యువకుడు కారు నుంచి దిగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పరస్పరం దాడి చేసుకున్నారు. యువకుడి దాడిలో బస్సుడ్రైవర్‌కు గాయం కాగా ప్రయాణికులు యువకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణ నేపథ్యంలో సుమారు పావుగంటకుపైగా బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ గొడవపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా బస్సుడ్రైవర్ ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్లాడని, అతను వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కుడా, దరఖాస్తు హన్మకొండ. సెల్: 8096520976. [WA-6506]

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. సంప్ర: 7842279342, హన్మకొండ. [WA-7530]

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 9872006329. [T-263]

HOTEL FURNITURE FOR SALE

■ హన్మకొండలోని చింతగట్టు క్యాంపు ముందు ఉన్న G.P. Mess Hotel ఫర్నీచర్ అమ్మబడును. సంప్రదించండి: సెల్: 97058 64281. [M-11860]

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం + కమిషన్ ఫోన్: 8295642391, 7015882322. [H-189684]

WANTED

■ Wanted Female Telecallers for SR Developer Kothawada 80ft Road, Warangal. Cell: 7997777377. [W-1239805]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185245]

■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు ఫీమేల్ హాస్టల్ ఇన్‌ఛార్జీలు కావలెను. జీతము: 12000/- మరియు భోజనం, వసతి కలిపించబడును. పనిచేయు ప్రదేశం: హైదరాబాద్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 91000 69434 [G-5521]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీత్లా ఉత్సవ విగ్రహాలు



బంజారాలు పవిత్రంగా నిర్వహించే మొదటి పండుగ సీత్లా పండుగ.. బంజారాల సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత సీత్లా భవానీ పండుగను నిర్వహిస్తారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సీత్లా భవానీ కాపాడుతుందని బంజారాల విశ్వాసం. పశు సంపద వృద్ధి చెందాలని.. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని.. అటవీ సంపద తరగకూడదనీ సీత్లా మాతకు మొక్కులు చెల్లిస్తారు. తండాల్లో జీవనం సాగిస్తున్న వారిలో పెద్ద మనిషితో చర్చించి ఆషాఢంలో ఒక మంగళవారం ఎంచుకుని సీత్లా పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగను ఏటా మంగళవారం రోజు మాత్రమే నిర్వహించడం ఆనవాయితీ. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు తండాలలో నేడు (మంగళవారం) సీత్లా భవానీ పండుగను జరుపుకుంటారు.

- హన్మకొండ కల్చరల్

సంప్రదాయ దుస్తుల్లో సీత్లా వద్దకు వెళ్తున్న బంజారాలు (ఫైల్)



అడవి బిడ్డల పండుగ సీత్లా

నేడు గొడ్లదాటుడు(దాటోడి) వేడుక

● నైవేద్యంగా బెల్లన్నం సమర్పణ ● ఆషాఢ మాసంలో బంజారాల తొలిపండుగ

బంజారాలు సంచారజీవులు..

పూర్వం బంజారాలు సంచార జీవనం సాగించేవారు.. రాజ వంశీయులైన వీరి ప్రధాన వృత్తి వ్యాపారం. ప్రపంచంలోని ఒక్కో తెగకు ఉన్నట్లే వీరికి ప్రత్యేక ఆచార, వ్యవహారాలు భిన్నంగా ఉన్నాయి. ప్రాచీన కాలంలో ముత్యాలు, రత్నాలు, ఉప్పు, జొన్నలు విరివిగా దొరికేవి.. దీంతో వీటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేస్తూ విక్రయిస్తుండేవారు. వాహనాలు లేకపోవడంతో ఎండ్ల బండినే ఉపయోగించి, వీరి సంచారం జీవనం గడిపేవారు. ఇందులో భాగంగానే ఎడ్లబండికి పశువులు అవసరం. అయితే ప్రాంతాలు మారుతున్న చోట తరచూ రోగాలబారిన పడి పశువులు మృత్యువాత పడేవి. ఈ క్రమంలో ఓ రోజు తండా పెద్ద (నాయక్) కలలో సీత్లా భవానీ ప్రత్యక్షమై తనను ప్రతిష్ఠించి పూజలు చేస్తే పశువులకు రోగాలు రాకుండా కాపాడుతానని వాగ్దానం చేస్తుంది. నాటి నుంచి నేటి వరకు మంగళవారం రోజు సీత్లా మాతను పూజిస్తారు.

సీత్లా భవానీ చరిత్ర..

దివి నుంచి భువికి దిగి వచ్చిన ఏడుగురు దేవతల్లో మేరమా, తోల్జా, మంత్రాళ్, కంకాళి, హింగ్లా, ద్వాళంగర్‌లలో చిన్నామే సీత్లా మాత. వీరికి ఓ తమ్ముడు లుంక్డియా ఉన్నాడు. ఏడుగురు దేవతల్లో ఆరుగురిని ఇంట్లోనే ప్రతిష్ఠించి పూజిస్తారు. కానీ అందరికన్నా చిన్నదైన సీత్లా భవానీని మాత్రం అడవిలో పూజిస్తారు. ఇందుకు కారణం సీత్లామాత, లుంక్డియా ఓసారి అడవిలో పశువులను మేపేందుకు వెళ్లి దారి తెలియక మాయమైపోయారు. సీత్లా మాత అక్కడే రాయిగా మారిందని పూర్వీకులు చెబుతారు. అందుకే సీత్లాను అడవిలోనే పూజించే ఆచారం తరతరాలుగా వస్తుంది.

తండా పొలిమేరలో సీత్లా మాత ప్రతిష్ఠ..

తండా సరిహద్దు పొలిమేర వద్ద సీత్లా భవానీని శాస్త్రీయంగా ప్రతిష్ఠిస్తారు. గిరిజన వేషధారణలతో మహిళలు పాటలు పాడుతూ.. డప్పు వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తూ సీత్లా ప్రతిష్ఠ ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ పూజ సమయంలో మహిళల పాటల్లో ప్రకృతి, వ్యవసాయ, పశు సంపదపై వారికున్న అనుభవాలను పాటల రూపంలో కనబడుతుంది. అనంతరం నవధాన్యాలను పశువుల మీద చల్లి దాటించి, తండా వాసులందరూ బాగుండాలని సీత్లా భవానీకి మొక్కులు చెల్లిస్తారు.

సంప్రదాయ నైవేద్యం, పూజలు

పొలిమేరలో ప్రతిష్ఠించిన సీత్లా మాతను బంజారాలు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని సాంప్రదాయంగా పూజలు చేస్తూ, పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. మేకలను బలిచ్చి వాటి పేగు పైనుంచి పశువులను దాటిస్తారు. దీనిని గొడ్ల దాటుడు (దాటోడి) అని పిలుస్తారు. పండుగ రోజు ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన రాళ్లను పూలతో అలంకరించి తమ ఇళ్లలో ముందు రోజు నానబెట్టిన జొన్నలు, నవధాన్యాలు గుగ్గిళ్లు వంటి నైవేద్యం వండుతారు. ఇంట్లో తయారుచేసిన బెల్లన్నం(లాప్సీ) గంగాజలంతో పూజలు చేస్తారు. ఉల్లిపాయ, ఎండు మిర్చి కానుకలు సమర్పిస్తారు.

బంజారాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి



బంజారాలకు సీత్లాభవానీ పండుగ ప్రత్యేకం. బంజారాల పండుగలపై వారి ఆచార సాంప్రదాయాలను వెలికితీసే విధంగా పరిశోధనలు జరగాల్సి ఉంది. బంజారాలకు పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అవకాశాలు కల్పించాలి. వారి పండుగలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి తగిన సదుపాయాలు, చేయూత ఇవ్వాలి.

- భూక్య బాబురావు, పీఠాధిపతి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, వరంగల్

అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి



తెలంగాణలో దాదాపు బంజారాలు 50లక్షల మంది పైగా ఉన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన బంజారాలను ప్రభుత్వం గుర్తించాలి. ప్రత్యేక రోజు అనేది లేకుండా బంజారాలు వారికి వీలైన రోజుల్లో సీత్లా భవానీ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఈ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు జరుపుకునేలా తీర్మానించాం. సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించింది. సీత్లాభవానీ పండుగ రోజునూ ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలి.

- బానోత్ నవీన్ నాయక్, సీత్లా భవానీ పండుగ ఉత్సవ కమిటీ, రాష్ట్ర అధ్యక్షుడు, పర్శనాయక్ తండా, నర్సంపేట

రాత్రి చోరీలు.. పగలు జల్సాలు

● దొంగల ముఠా అరెస్ట్
● ఎనిమిది విద్యుత్ మోటార్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లు

హసన్‌పర్తి : రాత్రి వేళ చోరీలకు పాల్పడుతూ.. పగలు జల్సా చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నగరంలోని మడికొండకు చెందిన పత్రి రాజు, శ్రీపతి ప్రేమ్‌కుమార్, తూర్పాటి ఏసుకుమార్ గ్రామాలకు వెళ్లి పాత ఇనుప సామాను సేకరించే వారు. అయితే వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం ప్రారంభించారు. జల్సాలకు ఆ డబ్బులు సరిపడకపోవడంతో రాత్రి వేళ చోరీలకు తెరలేపారు. వృత్తిని వదిలిపెట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈక్రమంలో వ్యవసాయ బావులకు ఉన్న మోటార్లు చోరీ చేసిన అనంతరం వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సా చేసేవారు. ఈ క్రమంలో కేయూసీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటార్లు తీసుకుని ద్విచక్రవాహనంతో వెళ్తూ పోలీసులకు చిక్కారు. అనుమానస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరించారు. ఈ మేరకు ఎనిమిది మోటార్లతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ చెప్పారు. సమావేశంలో కేయూ సీఐ సంజీవ, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్సైలు రాజ్‌కుమార్, దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, నిందితులు కేయూ పీఎస్ పరిధిలో రెండు, నల్లబెల్లి, దుగ్గొండి, చిల్పూరు, ఎల్కతుర్తి, సంగెం, స్టేషన్ ఘన్‌పూర్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మోటార్లు చోరీ చేశారని ఏసీపీ తెలిపారు.

గేదెను కాపాడబోయి రైతు మృతి

● నారాయణపురంలో ఘటన



కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదె, స్వామి

బచ్చన్నపేట : కరెంట్ షాక్‌తో గేదె, ఆ మూగజీవాన్ని కాపాడబోయిన ఓ యువరైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నారాయణపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిటి స్వామి (32) తన పశువులను మేపడానికి రోజూమాదిరిగానే సోమవారం ఉదయం పోతులోని కుంట వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంట్ స్తంభాలపై ఎల్‌టీ లైన్, కింద సరఫరా లేని తీగలు వేలాడుతున్నాయి. గతంలో పలుమార్లు ఆ కరెంట్ తీగలు పశువుల కొమ్ములకు చుట్టుకునేవి. మృతుడు స్వామి ఆ తీగలు విడిపించి పశువులను తోలుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం కూడా ఓ గేదె వేలాడుతున్న కరెంట్ తీగలను కొమ్ములకు చుట్టుకుని కొద్ది దూరం లాక్కొని వెళ్లింది. ఈ తీగలకు ఉన్న కాసారం వంగి పైన కరెంట్ సరఫరా ఉన్న తీగలకు తాకింది. దీంతో కరెంట్ సరఫరా అయి షాక్‌తో ఆ గేదె మృత్యువాత పడింది. దీనిని గమనించని రైతు స్వామి.. ఎప్పటి లాగే కరెంట్ తీగ గేదె చుట్టుకుందని భావించి విడిపించడానికి వెళ్లగా ఎర్త్ అయి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఘటనా స్థలికి ఎస్సై కంకల సతీష్‌కుమార్ చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వేలాడిన కరెంట్ తీగలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించకపోవడంతోనే స్వామి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

గేదె పొడిచి పశువుల కాపరి..



జనార్దన్ (ఫైల్)

రాయపర్తి(వర్ధన్నపేట): గేదె పొడవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన తోట జనార్దన్ (59) పట్టణానికి చెందిన గుజ్జ సోమేశ్వర్‌రావు వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈనెల 6న గేదెలు మేపేందుకు వెళ్తుండగా ఓ గేదె.. జనార్దన్‌ను పొడిచింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన జనార్దన్‌ను ఎంజీఎం తరలించగా చికిత్స చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.మృతుడి కుమార్తె దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాసిడ్ కలిపిన వాటర్ తాగి విద్యార్థినికి అస్వస్థత



హిందు

తరిగొప్పుల: యాసిడ్ కలిపిన వాటర్ తాగి విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చోటుచేసుకుంది. విద్యార్థిని తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన శివరాత్రి హిందు స్థానిక కసూర్బాగాంధీ విద్యాలయంలో 8వ తరగతి చదువుతుంది. కాగా ఆదివారం సాయంత్రం వ్యాయామం చేసిన అనంతరం హిందు తన వాటర్‌బాటిల్‌లోని నీటిని తాగింది. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు ఆ బాటిల్‌లో బాత్‌రూంలో వినియోగించే యాసిడ్‌ను కలిపారు. ఆ వాటర్ తాగిన విద్యార్థిని స్వల్ప అస్వస్థతకు గురైంది. విద్యార్థిని గ్రహించి పాఠశాల ప్రత్యేక అధికారికి తెలియజేయగా ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థిని తల్లికి సమాచారం అందించి అప్పగించారు. తమ కూతురుకు సహచర విద్యార్థులకు ఎలాంటి గొడవలు లేవని తెలిపింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కారకులతో పాటు పాఠశాల ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

ప్రాణం తీసిన భూతగాదా..

● మాజీ సర్పంచ్ దారుణ హత్య
● బురహాన్‌పల్లిలో ఘటన



దేవేందర్ (ఫైల్)

రాయపర్తి: భూతగాదా.. ఒకరి ప్రాణం తీసింది. మాజీ సర్పంచ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురహాన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్(56) హనుమకొండలోని యాదవనగర్‌లో కుటుంబీకులతో కలిసి నివాసముంటున్నాడు. సర్పంచ్ పదవి ముగిసినా పలువురి గ్రామస్తుల సమస్యల పరిష్కారం కోసం గ్రామంలోనే ఒంటరిగా ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఒంటరిగా ఉన్న దేవేందర్‌ను గమనించిన దుండగులు సుత్తితో తలపై మోదీ దారుణంగా హత్య చేశారు. గ్రామంలో మూడెకరాల భూమి విషయంలో గ్రామానికి చెందిన పల్లె మల్లేశ్‌తో దేవేందర్‌కు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఒకరికొకరు బాహాటంగానే చంపుతానని అనుకునేవారు. భూమి విషయంలో గతంలో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. మాజీ సర్పంచ్ హత్యపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసు జాగీలం అనుమానాస్పద వ్యక్తి పల్లె మల్లేశ్ ఇంటికే వెళ్లి ఆగడంతో గ్రామంలో అతడిపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్యలో పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు వెస్ట్‌జోన్ డీసీపీ తెలిపారు. కాగా, తమ తండ్రి దేవేందర్‌ను పల్లె మల్లేశ్, అతడి కుమారుడు మురళి హత్య చేశారని మృతుడి కుమారుడు నిఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మాజీ సర్పంచ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, దారుణహత్యకు గురైన బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ మృతదేహాన్ని జరిపేందుకుగాను గ్రామానికి చెందిన బాలె కొమురయ్య(70)అధికారులకు సహకరించాడు. ఈ క్రమంలో రక్తమడుగులో ఉన్న మృతదేహాన్ని చూసిన కొమురయ్యకు విరేచనాలయ్యాయి. ఇంటికి వెళ్లిన అనంతరం మృతిచెందాడు.

ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్

● రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకంపై ఉత్తర్వులు
● ఉమ్మడి వరంగల్ నుంచి నలుగురికి ఛాన్స్...
● 'కుడా' చైర్మన్‌గా వెంకట్రామ్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డికి 'ఆయిల్ సీడ్స్'..
● ప్రకాశ్‌రెడ్డికి 'వాణిజ్యం', బెల్లయ్యనాయక్‌కు ఎస్టీ కార్పొరేషన్..

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకానికి అధికారికంగా శ్రీకారం చుట్టింది. తెలంగాణ వ్యాప్తంగా 35 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకానికి ఎట్టకేలకు సోమవారం జీఓ విడుదల చేసింది. వాస్తవానికి మార్చి 15వ తేదీనే ఈ నియామకాలపై స్పష్టత వచ్చినప్పటికీ.. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నియమాకాల ప్రక్రియ ప్రకటనకు అడ్డంకిగా మారింది. ఎట్టకేలకు సుమారు 100 రోజుల తర్వాత సీఎస్ శాంతికుమారి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ల నియమాక ఉత్తర్వులు అధికారికంగా విడుదల చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లోని నలుగురు కాంగ్రెస్ పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం దక్కింది.

ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురికి 'నామినేటెడ్'..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో 35 మందిలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఆరుగురు సీనియర్లకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్ పదవులు దక్కాయి. ఆరు పదవుల్లో ఐదు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు కాగా, ఒకటి జిల్లాస్థాయి పదవి ఉంది. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కోటాలో పదవి దక్కింది. సీనియర్ కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అదే విధంగా ఎండీ.రియాజ్‌కు తెలంగాణ గ్రంథాలయ పరిషత్, పరకాల నుంచి ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్ పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో జంగా రాఘవరెడ్డి, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్ ఆశించగా.. అధిష్టానం నిర్ణయం మేరకు అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకున్నారు. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులు కాగా, మహబూబాబాద్ జిల్లా నుంచి టికెట్ ఆశించిన బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో సుమారు నాలుగున్నర నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను కలుపుకుని ఉమ్మడి వరంగల్ నుంచి మొత్తం ఏడుగురికి నామినేటెడ్ పదవులు దక్కినట్లయ్యింది.

ఆశావహులకు మళ్లీ నిరాశే..

మార్చిలో నియామక ఉత్తర్వులకు బ్రేక్ పడిన సమయంలో.. మార్పులు, చేర్పులకు అవకాశం ఉందనే ప్రచారంతో ఉమ్మడి వరంగల్ నుంచి ప్రయత్నాలు చేసుకున్న పలువురు సీనియర్లకు నిరాశే ఎదురైంది. ఈసారి వెలువడిన ఉత్తర్వులు కూడా పలువురు సీనియర్లను అసంతృప్తికి గురి చేశాయి. పలువురు సీనియర్లు.. అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చిన నేతలు, ఎమ్మెల్యేగా ఓటమి చెందిన వారికి ఈ జాబితాలో ప్రాధాన్యం దక్కకపోవడం చర్చనీయాంశమవుతోంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సింగాపురం ఇందిర, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్, సీనియర్ నేతలు ఈవీ శ్రీనివాస్‌రావు, పెరుమాండ్ల రామకృష్ణ, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, కూచన రవళిరెడ్డి, జాలి కమలాకర్ రెడ్డి, కత్తి వెంకటస్వామి, బండి సుధాకర్ గౌడ్, లక్ష్మీనారాయణ నాయక్, నాయిని లక్ష్మారెడ్డి, బట్టి శ్రీనివాస్‌కు దక్కలేదు. పాలకుర్తి నుంచి కోడలు యశస్వినిరెడ్డిని బరిలో దింపి ఎమ్మెల్యేగా గెలిపించిన ఝాన్సీరెడ్డికి ప్రోటోకాల్ కోసం రాష్ట్రస్థాయి పదవి ఈసారీ రాలేదు. దీంతో నిరాశకు గురైన సీనియర్లు, ఆశావహులు సీఎంరేవంత్ రెడ్డిని కలిసేందుకు సిద్ధం అవుతున్నారు.

'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి



నగరాన్ని బెస్ట్ సిటీగా చేయడమే ధ్యేయం

'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్ : వరంగల్ నగరాన్ని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయమని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం 'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కుడా' చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా మంత్రులు, ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన వెంకట్రామ్‌రెడ్డికి మేయర్ సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, 'కుడా' కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య, చిత్రంలో గుడి వంశీధర్‌రెడ్డి, తదితరులు

● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
● ఘన్‌పూర్‌లో ఘనంగా కడియం జన్మదిన వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: 'ఎన్ని జన్మలు ఎత్తినా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది.. నేను, నా కుటుంబం జీవితాంతం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాం' అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కడియం శ్రీహరి అభిమానుల ఆధ్వర్యంలో సోమవారం కడియం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ డాక్టర్ కావ్య, ఎమ్మెల్యే కడియం హాజరయ్యారు. కడియం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు, కాంగ్రెస్‌పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల సహకారంతోనే తాను ఎమ్మెల్యేగా, కావ్య ఎంపీగా విజయం సాధించారన్నారు. తుదిశ్వాస వరకు నియోజకవర్గ ప్రజలతోనే ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఎక్కువ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, గుడి వంశీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, మంతెన ఇంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రజాక్‌యాదవ్, పోశాల కృష్ణమూర్తి, తోట సత్యం, కనకం గణేశ్, కొలిపాక సతీశ్, తెల్లాకుల రామకృష్ణ, పద్మారెడ్డి, కిషన్‌రాజ్, గట్టు రమేశ్, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, చిల్పూరు శ్రీ బుగుల వెంకటేశ్వరస్వామి ఆలయంలో తన జన్మదినం సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎస్‌సీలతో సహకార సంఘాలు బలోపేతం

● టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న టీఎస్ కోఅపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: కామన్ సర్వీస్‌సెంటర్ (సీఎస్‌సీ) ల నిర్వహణతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మరింత బలోపేతమవుతాయని టీఎస్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, కంప్యూటర్ ఆపరేటర్‌లకు ఈగవర్నెన్స్ సర్వీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్నేని రవీందర్ రావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, వివిధ రకాల నోటిఫికేషన్‌లకు దరఖాస్తులు చేసుకోవడం, విద్యుత్, మున్సిపల్ ఇతర బిల్లులు చెల్లింపులన్నీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో మీ సేవ కేంద్రాల్లో అందించే సేవలను ఇక నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందించి గ్రామీణులకు డిజిటల్, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి సంక్షేమ పథకాలు, ఆధార్ సేవలు, పాన్‌కార్డు, ఎలక్ట్రికల్ బిల్స్, ఇంటి, నీటి పన్ను చెల్లింపులు, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్, పాస్‌పోర్టు సేవలు, మున్సిపల్ సర్వీసెస్, ఆర్‌టీఓ సేవలు, ఫాస్ట్ ట్యాగ్, రుణాలు, ఇన్సూరెన్స్, పెన్షన్‌తో పాటు అనేక రకాల సేవలు ఈ కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా అందించనున్నట్లు వివరించారు. కామన్ సర్వీస్ సెటర్ నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని సహకార సంఘాల సీఈఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ ఎం.డి.వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, డీజీఎం అశోక్, ఈ గవర్నెన్స్ సీనియర్ మేనేజర్ హరికృష్ణ, డీసీసీబీ మేనేజర్లు మాధురి, అరుణ్ కుమార్, లావణ్య, పవన్, అనంత బాబురావు పాల్గొన్నారు.